ప్రజాశక్తి
బుధవారం 13 నవంబర్ 2024 5
పార్వతీపురం మన్యం

15న జన్ జాతీయ గౌరవ దివస్

ప్రజాశక్తి -పార్వతీపురం

జన్ జాతీయ గౌరవ దివాస్ కార్యక్రమాన్ని ఈనెల 15న ఘనంగా నిర్వహించాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. ఈ విషయమై మంగళవారం తన కార్యాలయంలో అందరి సెక్టోరల్ అధికారులతో సమీక్షించారు. గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా ఆయనకు నివాళ్లు అర్పించాలని అన్నారు. ఆ రోజు వీర గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల జ్ఞాపకార్థం అంకితం చేయబడిన సంగతిని పిఒ గుర్తు చేశారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్నందున, అందుకు అనుగుణంగా నియమ నిబంధనలను పాటిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించాలని దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో ఐటిడిఎ ఎఒ, ఎపిడి-వెలుగు, ఎస్ఒ ఐటిడిఎ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను వీడని ఏనుగులు

- ఒడిశా వైపు తరలించినా వెనుదిరిగిన వైనం
- మన్యంలో పంటల రుచి మరిగిన కరిరాజులు
- తర్జనభర్జనలో అటవీశాఖ అధికారులు
- కుంకీ ఏనుగుల రాక కోసం ఎదురు చూపులు
- గుచ్చిమి అడవుల్లో క్యాంపు ఏర్పాటు కు చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం

గత కొన్నేళ్లుగావెంటాడుతున్న ఏనుగులు జిల్లాను ఇంత తొందరలో వీడే పరిస్థితి కనిపించడం లేదు. ఒడిశాలోని లఖేరియా శాంక్చువరీ నుంచి తప్పించుకుని మన్యం జిల్లాలో ప్రవేశించిన ఏనుగులు ఇక్కడ అనేక విధ్వంసాలకు పాల్పడుతున్నాయి. మనుషులను చంపడంతో పాటు పంటనష్టాలకు పాల్పడుతూ జిల్లా వాసులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. జిల్లా నలుమూలల తిరుగుతూ అటవీశాఖకు తలనొప్పిగా తయారయ్యాయి. అధికారులు, సిబ్బందికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఎప్పుడు ఎక్కడ ఏ రూపంలో ఎలాంటి విధ్వంసానికి పాల్పడతాయో అంచనా వేయలేని స్థితిలో ఏనుగులు సంచరిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 11 ఏనుగులు వున్నాయి. కొద్దిరోజుల క్రితం పార్వతీపురం మండలం పెదబొండపల్లిలో కనిపించిన ఏనుగులు ఆ ప్రాంతంలో ఒక వ్యక్తిని చంపేశాయి. జిల్లాలో ఇంతవరకు 12మంది ఏనుగుల దాడుల్లో మృతి చెందారు. 11మందికి ప్రభుత్వం పరిహారం చెల్లించింది. అయితే కొమరాడ మండలం వన్నాం గ్రామానికి చెందిన వ్యక్తికి పరిహారం పంపిణీ చేయలేదు. ఆ వ్యక్తి కుటుంబ తగాదాల కారణంగా ఇంతవరకు పరిహారం తీసుకోలేదు. జిల్లాలో ఏనుగులు 3300 ఎకరాల్లో పంటనష్టాలకు పాల్పడ్డాయి. 3800 మంది రైతులకు రూ.2 కోట్ల 16లక్షల 82వేల 487 పంట నష్టపరిహారం కింద ప్రభుత్వం పంపిణీ చేసింది. 2022 నుంచి పంట నష్టం కింద పరిహారం రూ.45 లక్షలు మంజూరు కావాల్సి ఉంది. జరిగిన పంటనష్టాన్ని పరిశీలించి అంచనా వేసి అటవీ, రెవెన్యూ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం పెదబొండపల్లి, దంగభద్ర ప్రాంతంలో ఏనుగులు సంచరిస్తున్నాయి. భామిని మండలంలో నాలుగు, దంగభద్ర ప్రాంతంలో 11 ఏనుగులు సంచరిస్తున్నాయి.

గుచ్చిమి రిజర్వ్ ఫారెస్ట్‌లో ఏనుగుల విడిది కేంద్రం

సీతానగరం మండలం గుచ్చిమి రిజర్వ్ ఫారెస్ట్ భూముల్లో ఏనుగుల విడిది కేంద్రం ఏర్పాటు యోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. దీని కోసం రూ.3 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు. కుంకీ ఏనుగులను తీసుకొచ్చి విడిది కేంద్రంలో ఉంచి మూడు నెలల పాటు వాటికి ప్రత్యేక శిక్షణ అందిస్తారు. ఈ కేంద్రంలో 15 అడుగుల లోతులో బంధిఖానాలు ఏర్పాటు చేసి విధ్వంసం చేసిన ఏనుగులను వాటిలో బంధిస్తారు. దీనికోసం ఈ కేంద్రంలో పెద్ద కాపలాదారులు, స్విమ్మింగ్ పూల్, ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్, బోర్లు నిర్మించనున్నారు. ఏనుగుల ఆహారం కోసం గడ్డి క్షేత్రాలను ఏర్పాటు చేస్తారు. విడిది కేంద్రం చుట్టూ ట్రెంచ్ ఏర్పాటు చేసి ఫెన్సింగ్ నిర్మాణం చేపట్టనున్నారు. 1075 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గుచ్చిమి రిజర్వ్ ఫారెస్ట్ భూముల్లో పది ఎకరాల్లో ఏనుగుల విడిది కేంద్రం ఏర్పాటు చేయాలనే ఆలోచనలో అటవీశాఖ వుంది.

తరలించినా కదలని కరిరాజులు

ఇటీవల పార్వతీపురం మండలం పెదబొండపల్లిలో విధ్వంసానికి, ఒక వ్యక్తి మరణానికి కారణమైన ఏనుగులను అటవీ అధికారులు, సిబ్బంది ఒడిశా వైపు తరలించేందుకు ప్రయత్నించారు. వాకీ టాకీలు, డ్రోన్లు, తారాజువ్వలతో వాటిని భామిని మండలం దాటించి ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఐదు కిలోమీటర్ల వరకు మళ్లించారు. సంగంవలస తోట వద్ద ఏనుగులు ఆగిపోయాయి. సాలూరు, కురుపాం, పార్వతీపురం అటవీ రేంజ్ అధికారులు, సిబ్బంది సాయంతో డిఎఫ్ఒ ప్రసూన సారథ్యంలో ఏనుగులను సాగనంపేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఉన్న గిరిజనులు ఏనుగులను మన్యం జిల్లా వైపు తరలించేందుకు ప్రయత్నించడంతో అవి తిరుగుముఖం పట్టినట్లు తెలుస్తోంది.

పంటలు రుచి మరిగిన ఏనుగులు

ఒడిశాలో ఉన్న లఖేరియా శాంక్చువరీ నుంచి జిల్లాలోకి ప్రవేశించిన ఏనుగులు ఇక్కడ పండుతున్న పంటలను రుచిమరిగాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఒడిశాలో అటవీ భూముల్లో గిరిజనులు పోడు వ్యవసాయం చేయడం, మైనింగ్ అనుమతులు మంజూరు చేయడం వల్ల ఏనుగుల మనుగడ ప్రశ్నార్థకం మారింది. పోడు భూములు సాగు చేస్తున్న గిరిజనులు కూడా ఏనుగులను బాంబులు పేల్చుతూ మందలు పెట్టి తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మన్యం జిల్లా లోకి ప్రవేశించిన ఒడిశా ఏనుగులపై ఆ ప్రభుత్వ అధికారులతో ఏపి అటవీ అధికారులు పలు దఫాలుగా చర్చలు జరిపినా అటువైపు నుంచి సానుకూల స్పందన లేకపోవడంతో జిల్లా అధికారులకు తలనొప్పి గా మారింది.

కుంకీ ఏనుగుల కోసం ఎదురు చూపులు

కర్నాటక రాష్ట్రంలో ఉన్న కుంకీ ఏనుగుల రాక కోసం అధికారులు ఎదురు చూస్తున్నారు. దుభేరి ఏనుగుల క్యాంపు నుంచి కుంకీ ఏనుగులను రప్పించే ప్రయత్నంలో అధికారులు వున్నారు. నిపుణులైన ట్రాకర్లు సాయికుమార్, మన్మధను కర్నాటక పంపించారు. ఏనుగులను ఎలా నియంత్రించాలనే దానిపై వీరిద్దరూ నెలరోజుల పాటు శిక్షణ పొందనున్నారు.

విడిది కేంద్రం ఏర్పాటు కు ప్రతిపాదనలు

ఏనుగుల విడిది కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. గుచ్చిమి రిజర్వ్ ఫారెస్ట్ భూముల్లో పది ఎకరాల్లో విడిది కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. జిల్లాలో ఏనుగుల కదలికలను డ్రోన్ల సాయంతో ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నాం. వాటి కదలికలను బట్టి సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. సంచరిస్తున్న ఏనుగుల్లో ఎక్కువగా విధ్వంసానికి పాల్పడే వాటిని క్యాంపులో ఉన్న బంధిఖానాలో బంధించడానికి ప్రతిపాదన సిద్ధం చేశాం.

మణికంటేష్,
ఎలిఫెంట్ మోనటరింగ్ యూనిట్ అధికారి

పక్కాగా వినతుల పర్యవేక్షణ : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో అందిన ప్రతి అర్జీని పక్కాగా పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక, గృహ నిర్మాణ సంస్థ ప్రగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పిజిఆర్ఎస్‌లో అందిన ప్రతి అర్జి సంబంధిత శాఖ క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, తద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆయన ఆదేశించారు. అర్జీ సక్రమంగా పరిశీలించకుండా సరైన సమాచారం ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గృహ నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన ఆదేశించారు. గతంలో గృహ నిర్మాణ పథకం కింద మంజూరు చేసిన ఇళ్లు గడువు త్వరలో ముగుస్తుందన్నారు. లబ్ధిదారులు త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని ఆయన కోరారు. పథకం పూర్తి తర్వాత రద్దు అయ్యే అవకాశాలు ఉన్నాయని ఆయన సూచించారు. ఫ్లాగ్ డే స్టిక్కర్లను కొనుగోలు చేసి సహకారం అందించాలని ఆయన అన్నారు. శాసన మండలి ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల పరిశీలన చేసి చేర్పులు మార్పులు తెలియజేయాలన్నారు. నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల్లో నియమితులైన అధికారులు, సిబ్బందికి ఈ నెల 14న శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటరు జాబితా ఇప్పటికే పంపించామని చెప్పారు.

ఉచిత ఇసుకకు నమోదు చేసుకోవాలి

స్థానిక అవసరాలకు ఉచిత ఇసుక పొందేందుకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కలెక్టర్ చెప్పారు. నమోదు చేసుకోవడం వల్ల ఉచిత ఇసుక అనుమతి పత్రం లభిస్తుందన్నారు. స్థానిక ప్రభుత్వ అవసరాలకు, ఇంజినీరింగ్ అవసరాలకు వినియోగించుకోవచ్చని అన్నారు. సొంతంగా ఆన్‌లైన్‌లోనైనా, డిజిటల్ సహాయకుని సాయం పొందవచ్చని ఆయన వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, పలుశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కెజిబివి టీచర్లకు సంక్రాంతి సెలవుల జీతాలివ్వాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

కెజిబివిల్లో పని చేస్తున్న టీచర్లకు సంక్రాంతి సెలవుల జీతాలివ్వాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ 2023 డిసెంబర్ 2024 జనవరి 10వరకు కెజిబివి టీచర్లు సమ్మె చేశారని చెప్పారు. 10న సమ్మె విరమణ చేసిన తర్వాత 11 నుంచి 20వరకు సంక్రాంతి సెలవులు వచ్చాయని చెప్పారు. జనవరి 8,9 తేదీల్లో చేరిన టీచర్లకు అన్ని జిల్లాల్లో జీతాలు చెల్లించారని, మన్యం జిల్లాలో మాత్రం జీతాలు చెల్లించలేదని తెలిపారు. డిఇఒ కెజిబివి టీచర్లకు సంక్రాంతి సెలవుల జీతాలు చెల్లించేలా చొరవ చూపాలని మురళీమోహన్ రావు కోరారు.

జమిలీ ఎన్నికల నిర్ణయాన్ని ఉపహరించుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - సాలూరురూరల్

మామిడిపల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. మండలంలోని మామిడిపల్లిలో సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహిస్తున్న ప్రజాపోరులో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర కూటమి ప్రభుత్వాలు ఏర్పడినప్పటి నుంచి నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నా, విద్యుత్ ధరలు సామాన్యుడు మోయలేని భారం అవుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇదే విధంగా ప్రభుత్వాలు ముందుకెళ్తే ప్రజలు పూటగడవడానికి చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నిరంతరం తమ వద్ద అధికారం అట్టిపెట్టుకోవడానికి రాజ్యాంగ వ్యతిరేక నిర్ణయాలతో బలవంతంగా కేంద్ర ప్రభుత్వం జమిలీ ఎన్నికలు నిర్వహణకు పూనుకుంటుందని విమర్శించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను తప్పుదారి పట్టించేలా ప్రజా వ్యతిరేక నిర్ణయాలను తీసుకుంటుందని విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కువ మందికి ఉపాధిని ఇచ్చే అతి పెద్ద కంపెనీ విశాఖ ఉక్కు అని, అటువంటి కర్మాగారాన్ని ప్రభుత్వాలకు తొత్తులుగా ఉన్న కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేయడాన్ని, ఉద్యోగుల తొలగింపును విరమించుకోవాలని, ప్రభుత్వ చౌకదుకాణాల ద్వారా నిత్యవసర వస్తువులు రాయితీపై ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుపై చిత్తశుద్ధి చూపించాలని తెలుపుతూ మామిడిపల్లిలో ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తూ ఈనెల 14న సాలూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో ప్రజలంతా పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, మండల కమిటీ సభ్యులు గెమ్మెల జానకీరావు, వంతల సుందర్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల పనితీరు భేష్

మరింత మెరుగైన సేవలకు సహకారం
వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వి.కరుణ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు భేషుగ్గా ఉందని, మరింత మెరుగైన సేవలు అందించేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వి.కరుణ తెలిపారు. జిల్లాలో రెండు రోజుల పర్యటన నేపథ్యంలో మంగళవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రితో పాటు జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ప్రభుత్వా ఆసుపత్రిలో ఎంసిహెచ్, ట్రైబల్ సెల్‌లోని రోగుల వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించి రిఫరల్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి కేసులు లేకపోవడంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ట్రైఏజ్, హెచ్‌డియు, లేబర్, ఎంఒటి, ఆపరేషన్ థియేటర్, సర్జికల్, పిడియాట్రిక్, న్యూబోర్న్, కంగారు మాతృ సంరక్షణ యూనిట్లను సందర్శించి పరిశీలించారు. పసిపాపను ఎత్తుకొని, ఆసుపత్రిలో అందుతున్న వసతులపై బాలింతలను అడిగి తెలుసుకున్నారు. తదుపరి జిల్లా బాలల సంరక్షణ చికిత్స కేంద్రాన్ని సందర్శించి, అక్కడ వివిధ విభాగాలను తనిఖీ చేశారు. వివిధ లోపాలు గల చిన్నారులకు అందిస్తున్న వైద్య సేవలను తిలకించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు అందిస్తున్న సేవలు బాగున్నాయని, ఇంకా మెరుగైన సేవలందించాలని ఆమె వైద్యులను కోరారు. ఇందుకు ప్రభుత్వపరంగా అందించాల్సిన పరికరాలు, సదుపాయాలు, వసతుల కల్పనకు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. జిల్లాలో రక్తహీనతతో హైరిస్క్ గర్భిణీలపై ప్రత్యేక దృష్టి సారించాలని, మాతా, శిశు మరణాలు లేకుండా వైద్యులు చూడాలని తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయపార్వతీ, వైద్య ఆరోగ్య శాఖ నోడల్ అధికారి డాక్టర్ ఎం.వినోద్, ఏరియా, బాలల సత్వర చికిత్స ఆసుపత్రుల మెడికల్ ఆఫీసర్లు, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు మాట్లాడుతున్న కమిషనర్ కరుణ

సాలూరు : హాస్టల్‌లో ఉన్న గిరిజన గర్భిణులకు పండ్లు పంపిణీ చేస్తున్న కరుణ

గర్భిణుల వసతిగృహంలో వైద్యసేవలపై సంతృప్తి

సాలూరు : గర్భిణుల వసతి గృహాల్లో వైద్య సేవలు, సదుపాయాలు బాగున్నాయని కమిషనర్ వి.కరుణ తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా సాలురులోని ఐటిడిఎ వైటిసి భవనంలో గల గర్భిణుల వసతి గృహాన్ని ఆమె సందర్శించారు. అక్కడ గర్భిణులకు అందుతున్న సదుపాయాలు, వ్యాక్సిన్లు గురించి అడిగి తెలుసుకొని పండ్లు పంపిణీ చేశారు. తమకు ఎటువంటి సమస్యలు లేవని, సమయానుకూలంగా అన్ని సదుపాయాలు అందుతున్నట్లు గర్భిణులు కమిషనర్‌కు తెలిపారు. సాలూరు, గుమలక్ష్మీపురం ఈ వసతి గృహాలను నిర్వహించడం పట్ల కమిషనర్ సంతోషం వ్యక్తం చేశారు. అదనపు వసతి గృహాలపై ఆమె ఆరా తీశారు. వసతి గృహంలో కొన్ని సమస్యలు ఉన్నాయని మీడియా ప్రతినిధులు కమిషనర్‌కు తెలియజేయగా నిధులు అందుబాటులో ఉన్నాయని, అన్నింటిని పరిష్కరిస్తామనితెలిపారు. తొలుత పార్వతీపురం మండలం ఎం.ఆర్.నగర్‌లోని గ్రామ ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి - పార్వతీపురం

రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి డి.రామగోపాల్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అవగాహన కార్యక్రమాలను, ర్యాలీలను స్థానిక స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రవాణా శాఖ సిబ్బంది సహకారంతో మంగళవారం నుంచి గురువారం వరకు సాలూరు, పాలకొండ, పార్వతీపురం, కురుపాం నియోజక వర్గాల పరిధిలో చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. రోడ్డు ప్రమాదాల నిర్వహణలో భాగంగా శిరస్త్రాణం అవశ్యకత తెలియజేస్తూ స్థానిక ప్రజలకు, యువతకు అవగాహన ర్యాలీలు, కార్యక్రమాలను వివిధ ప్రదేశాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో అవగాహన నిర్వహించామన్నారు.

అవగాన సదస్సులో మాట్లాడుతున్న సిఐడి ఎఎస్‌పి ప్రేమకాజల్

చట్టాలపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

ఎస్సీ, ఎస్టీలకు చట్టాలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని సిఐడి విశాఖ రీజినల్ అడిషనల్ ఎస్పీ డాక్టర్ ప్రేమకాజల్ అన్నారు. మంగళవారం కురుపాంలో గల కళ్యాణ మండపం వద్ద ఆంధ్రప్రదేశ్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ చట్టాలు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, అత్యాచార నిరోధక చట్టం-1989పై అవగాహన తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు, వివక్ష, అత్యాచారాలు పూర్తిగా అంతరించాలంటే చట్టాలు పకడ్బందీగా అమలు కావాలన్నారు. తప్పు చేసిన వారిపై పూర్తిస్థాయిలో ఎఫ్ఐఆర్, చార్జిషీట్ పోలీసులు నమోదు చేయడం, సాక్ష్యాలు బలంగా ఉండేలా చర్యలు తీసుకోవడం జరగాలని, అలాంటప్పుడే చట్టాలపై నమ్మకం ఉంటుందని, వ్యక్తిగత కక్షల కోసం ఈ చట్టాన్ని ఉపయోగిస్తే కోర్టుల్లో శిక్ష పడే అవకాశం ఉండదన్నారు. విశాఖ రీజియన్ డిఎస్‌పి కె.కుమారస్వామి, సిఐ ఎం.బుచ్చిరాజు మాట్లాడుతూ ప్రజల్లో చట్టాలపై అవగాహన కల్పించే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు తెలిపారు. చట్టాలు 35 ఏళ్ల క్రితం ప్రారంభమైనా ఇంకా కులవివక్ష కేసులు నమోదు కావడం దురదృష్టకర మన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.జోగారావు, పాలకొండ డీఎస్పీ రాంబాబు, ఎస్సీ, ఎస్టీ సాధికారత షెడ్యూల్డ్ అధికారి గయాజుద్దీన్, ఎల్విన్‌పేట సిఐ హరి, ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, తహశీల్దార్ ఎం.రవణమ్మ, ఎస్ఐలు హరిబాబు, పి. నారాయణ రావు, శివ ప్రసాద్, ఎస్ సొసైటీ అధ్యక్షులు ఎస్‌కె గౌస్, గిరిజన సంఘం నాయకులు ఐ.రామకృష్ణ, లోవరాజు, చంద్రశేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్‌లో సాత్విక్ కు బంగారు పతకం

ప్రజాశక్తి - వీరఘట్టం

విజయనగరం జిల్లా భోగాపురంలో ఇటీవల జరిగిన అండర్-14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి అరగలి సాత్విక్ ప్రథమ స్థానం గెలిచి బంగారు పతాకం సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సాత్విక్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సుంబోరా, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

జీవన్ కుమార్ మృతి పట్ల పునః విచారణ

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

విద్యార్థులను విచారిస్తున్న అధికారులు

మండలంలోని రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఈ నెల 6న ఏడో తరగతి విద్యార్థి నిమ్మక జీవన్ కుమార్ మృతి ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ పూర్తిస్థాయి విచారణ చేపట్టేందుకు కమిటీని నియమించారు. గిరిజన సంక్షేమ డిడి గయాజుద్దీన్, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ పద్మావతి, డిప్యూటీ డిఇఒ మోహన్ రాయుడు, మండల తహశీల్దార్ ఫకీర్ పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులను విచారించారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎం.తిరుపతి, డిప్యూటీ వార్డెన్ గణపతిరావు, ఆఫీస్ సబార్డినేట్ సిహెచ్ వెంకటేష్‌ను విచారించి వారి నుంచి రాతపూర్వక విషయాలను సేకరించారు. వీటన్నింటినీ ఐటిడిఎ పిఒకు అందజేస్తున్నట్లు ఆ కమిటీ తెలిపింది.

మంగళాపురంలో అనధికారికంగా నిర్వహిస్తున్న ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

అక్కడ పట్టుకున్నారు... ఇక్కడ వదిలేశారు

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలో ఇసుక దందా ప్రతిరోజు లక్షల్లోనే సాగుతుంది. నాగావళి తీర ప్రాంతాల నుంచి నిత్యం ఈ వ్యాపారం సాగుతోంది. గ్రామాల నుంచి రోజుకు వందల సంఖ్యలో వాహనాలు తరలిపోతున్నాయి. దీన్ని పట్టించుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరుతున్నట్టు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ నేతలే ఇసుక దందాకు కొమ్ముకాస్తున్నట్లు ఆరోపణ వినిపిస్తున్నాయి. మండలంలోని చిన్న మంగళాపురం, గొట్టు మంగళాపురం, అంపిలి, గోపాలపురం నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. రోజుకు వందలాది ట్రాక్టర్లు, లారీల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. రాత్రీపగలు తేడా లేకుండా తరలిపోయింది. గోపాలపురంలో ఏకంగా రోడ్డునే నిర్మించి ఇసుకను బహిరంగంగా లారీలకు తరలిస్తున్నారు. ఉచిత ఇసుక విధానం అంటూ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం జరగడం లేదు. లారీకి రూ.10వేలు, ట్రాక్టర్‌కు రూ.3వేలు వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. మంగళవారం సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి, తహసీల్దార్ బి. బాలమురళీకృష్ణ, ఎస్ఐ ప్రయగమూర్తి చిన్న మంగళాపురంలో అనధికారంగా నడుస్తున్న ఇసుక ర్యాంప్ దగ్గరకు చేరుకొని 15 ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఇసుక అక్రమంగా తరలిస్తే తీవ్ర చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ హెచ్చరించారు. ఐతే గోపాలపురం, అంపిలి ప్రాంతాల నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శలు వినిపిస్తున్నాయి.

సిఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శ్రీరంజిని

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న శ్రీరంజిని

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

స్థానిక కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపల్ సిహెచ్ శ్రీరంజిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును మంగళవారం అందుకున్నారు. విద్యాభివృద్ధి, విద్యార్థుల ఉత్తమ ఫలితాల సాధనకు ఆమె చేసిన కృషిని గుర్తించిన ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేశారు. ఈ మేరకు ఆమె సిఎం చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు పొందడం పట్ల ఎటిడబ్ల్యూఒ సురేష్ కుమార్, ఎంఇఒ చంద్రశేఖర్, గ్రామస్తులు అభినందించారు.

మంజుల వీణకు గురు బ్రహ్మ అవార్డు

మక్కువ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి మంజులవీణ రాష్ట్రస్థాయి గురుబ్రహ్మ అవార్డు అందుకున్నారు. మంగళవారం విశాఖపట్నం మదర్ తెరిసా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు కృష్ణమూర్తి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆమెకు అవార్డును అందజేశారు

రవికుమార్‌కు...

పార్వతీపురం రూరల్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్న తెర్లి రవికుమార్‌ను మదర్ తెరిసా ఫౌండేషన్ సంస్థ గురు బ్రహ్మ అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా డిఇవిఒ మంజుల వీణ తన కార్యాలయంలో అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె రవికుమార్ సేవలను కొనియాడారు. ప్రిన్సిపల్ జె.రామారావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

గిరిజన రైతులకు విత్తనాలు అందజేస్తున్న వ్యవసాయాధికారులు, సర్పంచ్

గిరిజన రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని రావికోన పంచాయతీ, సంఘంవలస రైతు సేవా కేంద్రం పరిధిలోని గిరిజన రైతులకు మంగళవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్ ఆధ్వర్యంలో 100శాతం సబ్సిడీపై మినుము విత్తనాల కిట్లను పంపిణీ చేశారు. సర్పంచి కద్రక రామస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిఎఒ మాట్లాడుతూ గిరిజన ప్రాంత రైతులకు వ్యవసాయంలో ప్రోత్సాహకాలు అందించే పథకాల్లో భాగంగా ఖరీఫ్ సీజన్ అనంతరం చేసే అపరాలు సాగు కోసం 100శాతం మినుము విత్తనాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అశోక్, సచివాలయ సహాయకులు పావని, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపోరు కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

ప్రజా సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 14న జిల్లా మండల కేంద్రాల్లో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మొండెంఖల్ సంతలో మంగళవారం సిపిఎం నాయకులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా మద్యం షాపులు విచ్చలవిడిగా అమ్మకాలు కొనసాగుతున్నాయని, విద్యుత్‌ఛార్జీలు పెంచమని చెబుతూనే ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై కూటమి ప్రభుత్వం రూ.6వేల కోట్లు భారం వేసిందన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.ఇండియా, బి.అనిల్, బి.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - కురుపాం

ఈనెల 14 నుంచి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు స్థానిక గ్రంథాలయ నిర్వాహకులు ఎపి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల సమయంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తూ విజేతలకు బహుమతులు అందజేస్తున్నామన్నారు. విద్యార్థులు, యువత ఈ వారోత్సవాల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

జీడి పంటకు బీమా చేసుకోవాలి

ప్రజాశక్తి - సీతంపేట

జీడి పంట ఇన్సూరెన్స్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి.శ్రీదేవి తెలిపారు. వాతావరణ ఆధారిత ఇన్సూరెన్స్ రబీ పంట కాలం నుంచి రైతులు ఐదు శాతం ప్రీమియం చెల్లించాలన్నారు. జీడి పంటకు ఎకరాకు రూ.1600 చెల్లించాలన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పంట నష్టం జరిగితే మండలాన్ని యూనిట్‌గా తీసుకొని ఎకరాకు రూ.32 వేలు బీమా పొందే అవకాశం ఉందని చెప్పారు. కావున రైతులు సమీపంలోని మీసేవ కేంద్రంలో గానీ, రైతు సేవ కేంద్రంలో గానీ సంప్రదించి వారి ఆధార్ కార్డు, పట్టా, బ్యాంకు పాస్ పుస్తకం, ఫోన్ నెంబర్ ఇచ్చి నమోదు చేయించుకోవాలన్నారు. ఈనెల15 లోగా నమోదు చేసుకోవాలన్నారు. మండలంలోని రైతులంతా ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

ప్లాస్టిక్ సంచుల వాడకంతో అనారోగ్య సమస్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్లాస్టిక్ సంచుల వాడకం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ప్లాస్టిక్ రహిత సంచులను వాడి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని మున్సిపల్ కమిషనర్ (ఎఫ్ఎసి) శ్రీనివాసరాజు అన్నారు. స్వచ్ఛత సుందరం అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొత్తవలసలోని పెద్ద వీధిలో సచివాలయాల శానిటరీ సెక్రెటరీలు స్థానిక మహిళలకు తడి, పొడి చెత్తలు, వ్యర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల వాతావరణంలో మార్పులు, ప్లాస్టిక్ సంచుల వాడడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ప్లాస్టిక్ రహిత సంచులను వినియోగించేందుకు ప్రజలు బాధ్యత వహించాలని తెలుపుతూ, అవార్డు స్థానికులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎఎస్ఒ వీరినాయుడు, సచివాలయాల శానిటేషన్ సెక్రెటరీలు, మేస్త్రిలు, ప్రజలు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

పార్వతీపురం టౌన్ : జిల్లా కేంద్రంలో సొంత ఇల్లు లేని పట్టణ ప్రజలకు 2 సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు చొప్పున మంజూరు చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గరుగుబిల్లి సూరయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం 18,21,24 వార్డుల్లో ప్రచారం చేశారు. గత వైసిపి ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన లేఔట్లను మార్పు చేసి పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని రోడ్లు, విద్యుత్తు, తాగునీరు, డ్రైనేజీ, నీటిపారుదల వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ మేరకు ఈనెల 18న అన్ని గ్రామ, వార్డు సచివాలయాల వద్ద పేదలతో వ్యక్తిగత అర్జీలు అందించే ఆందోళన కార్యక్రమం చేపడతామన్నారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

నిరాశ కల్పించిన బడ్జెట్ : సిపిఎం

ప్రజాశక్తి - పాచిపెంట

టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో బడ్జెట్లో కనీస ప్రస్థానం లేకపోవడం ప్రజలను నమ్మకాన్ని దెబ్బ తీసేలా ఉందని, ఈ బడ్జెట్ తీరని నిరాశ కలిగిస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు వి.ఇందిర అన్నారు. పాచిపెంటలో సిపిఎం సీనియర్ నాయకులు సూకూరు అప్పలస్వామి ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను ప్రజలంతా వ్యతిరేకించాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్‌లో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని ప్రస్తావన లేకపోవడం చాలా బాధాకరమన్నారు. ఉత్తరాంధ్ర నీటి అవసరాలు తీర్చే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు ప్రస్తావనే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న జంఝావతి, రామతీర్థసాగర్ వంటి ప్రాజెక్టుల సమస్యలు పట్టించుకో లేదన్నారు. జిఒ 3 పునరుద్ధరణ ప్రస్తావన లేకపోవడం గిరిజన యువతపై తీవ్ర నిరాశ కలిగించిందన్నారు. కార్పొరేట్లకు వరాలు జల్లు కురిపించేలా ఈ బడ్జెట్ ఉందని, ఇచ్చిన హామీలు ఒక్కటీ అమలు చేసేలా లేదని, ఎప్పటికైనా హామీల అమలుపై రైతాంగానికి మేలు చేసేలా పరిశ్రమలు తెచ్చే అంశాలను బడ్జెట్లో పెట్టి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, వ్యవసాయ రంగాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ బడ్జెట్‌కు వ్యతిరేకంగా ప్రజలంతా పోరాడాలని, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రభుత్వాలు వెంటనే కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, మండల నాయకులు మంచాల శ్రీనివాసరావు, కొర్ర కళ్యాణ్, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాస్‌పై శిక్షణ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాష్ కార్యక్రమంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఎపిఒ ఆర్.శ్రీరాములు ఆధ్వర్యంలో గ్రామైక్య సంఘల పరిధిలో పలువురు మహిళలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిటిడి కె.త్రివిక్రమరావు మాట్లాడుతూ మొదటి రోజు 18 గ్రామాలకు, రెండో రోజు 18 గ్రామాలకు శిక్షణ నిర్వహిస్తామన్నారు. నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించి వారికి చదువుపై ఆసక్తి, అలాగే శ్రద్ధగా నేర్పించే కార్యక్రమమే ఉల్లాష్ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ప్రతి గ్రామైక్య సంఘాల పరిధిలో 30 మంది చొప్పున నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించి స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. యువతతో డిజిటల్ పద్ధతిలో చదువు నేర్పించడం జరుగుతుందన్నారు. కావున ప్రతి నిరాక్షులైన మహిళలు సమయం కేటాయించుకొని చదువు నేర్చుకోవాలన్నారు. చదువు నేర్చుకోవడం వల్ల రానున్న రోజుల్లో ఎంతో ఉపయోగపడుతుందని, అందువల్ల ప్రతి ఒక్క నిరాక్షులైన మహిళలు వ్యక్తిగత శ్రద్ధతో ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధిలోకి రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సూర్యదేవుడుతో పాటు సిసిలు, విఒఎలు, గ్రామైక్య సంఘాల మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట : నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎడి వైకుంఠరావు అన్నారు. మండలంలోని ఎంఎంఎస్‌లో గ్రామైఖ్య సంఘాలకు అక్షర వెలుగుపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు శిక్షణ ఉంటుందని, దీన్ని వినియోగించుకోవాలని అన్నారు. నిరక్షరాస్యులను అక్షరాసులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. సభ్యులు అక్షరాసులుగా మారాలని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ మానస,

సీతానగరం : శిక్షణలో మాట్లాడుతున్న ఎంపిడిఒ త్రివిక్రమరావు

వెలుగు ఎపిడి సన్యాసిరావు, ఎపిఎం కమల పాండియన్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్: డ్వాక్రా మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని అమలు చేస్తున్న ఉల్లాస పథకం విజయవంతం చేసి మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ కె.రూపేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో డ్వాక్రా మహిళా సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, ఆర్థిక వ్యవహారాల నిర్వహణకు మహిళలు అక్షరాస్యులుగా మారి స్వాలంబన సాధించాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సన్ని బాబు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ ఉద్దేశమని ఎంపిడిఒ బి.వెంకటరమణ అన్నారు. స్థానిక మండల మహిళా సమైక్య కార్యాలయంలో అభ్యసన అవగాహన మండల స్థాయి శిక్షణ తరగతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 1430 మంది నిరక్షరాస్యులను గుర్తించి పదిమందికి ఒకరు చొప్పున వాలంటరు ద్వారా విద్యాభ్యాసం అందించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం కె.రాము, ఎఫ్‌పిఒ సిసి వై.ఆనందరావు, విఒఎలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిఇఒ తిరుపతినాయుడు

పాఠశాలలను పరిశీలించిన డిఇఒ

ప్రజాశక్తి - భామిని

స్థానిక జిల్లా పరిషత్, ఆశ్రమ పాఠశాల, ఆదర్శ పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతినాయుడు మంగళవారం పరిశీలించారు. విద్యార్థుల అపార్ ఐడిపై పాఠశాలలో సూచనలు చేశారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల అకాడమీ స్టాండర్డ్స్‌ను పరిశీలించారు. మధ్యాహ్నం భోజనం పరిశీలించారు. పాఠశాలలో రుచికరమైన భోజనం, ఆహ్లాద వాతావరణంలో పిల్లలకు అర్థవంతగా పాఠ్యాంశాల బోధనకు ఉపాధ్యాయ సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 ఊయక భాస్కరరావు ఉన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని తాటిశీల ఎంపిపి పాఠశాలను జిల్లా విద్యాశాఖధికారి ఎన్.తిరుపతినాయుడు మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ప్రార్థనా సమయానికి విద్యార్థులంతా హాజరు కావడంతో సంతోషం వ్యక్తం చేశారు. తెలుగు, ఇంగ్లీష్, లెక్కలు సబ్జెక్టుల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బడితోటలో పెరిగే కూరగాయల మొక్కలు, పూల తోటలు, పరిసరాల పరిశుభ్రతను చూసి కొనియాడారు. ఉపాధ్యాయుల టీచింగ్ డైరీ, లెసన్ ప్లాన్, పరీక్షా పత్రాలు, మూల్యాంకన పత్రాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. ప్రణాళికా బద్ధంగా అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ జెఇ డి.కళ్యాణదుర్గ, ఎపిఒ జి.సత్యంనాయుడు, ఎపిఎం కె.రాము, సచివాలయ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక వైటిసిలో గ్రామ అభివృద్ధి, పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి ఆదినారాయణ మాట్లాడుతూ మండల స్థాయిలో ఈ శిక్షణ జరుగుతుందని, దీన్ని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది వినియోగించుకోవాలని కోరారు. పంచాయతీరాజ్ చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎపిడిఒ మానస, సిడిపిఒ రంగలక్ష్మి, ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం, పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు .

శిక్షణలో మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకటరమణ

సబ్‌సెంటర్లను సందర్శించిన వైద్యశాఖ ఎడి

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామీణ ఆరోగ్య కేంద్రాల ద్వారా అందిస్తున్న వైద్యసేవల తీరును వైద్య శాఖ రాష్ట్ర అదనపు సంచాలకులు (ఎంసిహెచ్) డాక్టర్ కెవిఎన్ఎస్ అనిల్ కుమార్ పరిశీలించారు. ఈ మేరకు ఆయన తన వైద్య బృందంతో మండలంలోని మరిపివలస, కాసాపేట హెల్త్, వెల్నెస్ కేంద్రాలను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో మందులు, డయాగ్నొస్టిక్స్ లభ్యత, వైద్య పరికరాల పనితీరు, నాణ్యత, పలు ఆరోగ్య కార్యక్రమాల రికార్డులు, ప్రగతి నివేదికలు నిశితంగా పరిశీలించారు. డయాగ్నొస్టిక్ పరీక్షలు చేయి పద్ధతులపై ఆరా తీసి అక్కడ స్వయంగా చేయించి గమనించారు. గ్రామీణుల ఆరోగ్యాన్ని మెరుగు పరిచే లక్ష్యంతో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు పనిచేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, స్టేట్ వైద్య బందం డాక్టర్ జి.ప్రహర్ష, డాక్టర్ నాగేంద్ర, ఆర్.వెంకటేష్, వైద్యాధికారి డాక్టర్ ఉషారాణి, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

పార్వతీపురం రూరల్ : మండలంలోని బందలుప్పి పిహెచ్‌సి పరిధిలోని నర్సిపురం సబ్ సెంటర్‌ను రాష్ట్ర వైద్య

సిబ్బందికి సూచనలు ఇస్తున్న అనిల్‌కుమార్

ఆరోగ్యశాఖకు చెందిన సోనియా మోహన్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సబ్ సెంటర్లో సిబ్బంది అందిస్తున్న సేవలు, మౌలిక సదుపాయాలు ఏర్పాటు, రికార్డులు పరిశీలించారు.

బడ్జెట్‌లో సూపర్ సిక్స్ హామీల ప్రస్తావనేదీ?

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెట్టిన బడ్జెట్‌లో ఎన్నికల ముందు టిడిపి కూటమి పార్టీలు ఇచ్చిన హామీల అమలు గురించి ప్రస్తావన చేయకపోవడం అన్యాయమని రాష్ట్ర రిపబ్లికన్ పార్టీ నాయకులు గొంప ప్రకాశరావు అన్నారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో మాట్లాడుతూ బడ్జెట్‌తో సామాన్య మధ్యతరగతి ప్రజలకు ఒరిగేదేమీ లేదని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు సబ్‌ప్లాన్ ప్రకారం బడ్జెట్లో కేటాయింపులు చేయలేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల గురించి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

శాసనసభ విప్‌గా జగదీశ్వరి

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శాసనసభ విప్‌గా నియమితుల య్యారు. మొదటిసారిగా గెలిచిన ఆమె అసెంబ్లీ విప్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేల్లో జగదీశ్వరికే విప్‌గా పనిచేసే అవకాశం లభించింది. ఈ నేపథ్యంలో ఆమెకు నియోజకవర్గ నాయకులు, పలువురు ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

ఫ్లైఓవర్‌పై వీధిలైట్లు వెలిగించాలి

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ఫ్లైఓవర్ బ్రిడ్జి మీద ఉన్న వీధిలైట్లు వెంటనే వెలిగించాలని ఎస్సీ, ఎస్టీ మోనిటరింగ్ కమిటీ సభ్యులు సవరపు రామారావు కోరారు. ఈ మేరకు పెద బోగిలి పంచాయతీ ఇన్చార్జి అధికారికి రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లుగా బ్రిడ్జిపై వీధి దీపాలు వెలగకపోవడంతో వాహనదారులు అనేక ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. దీనిపై జిల్లా అధికారులు, పంచాయతీ అధికారులు స్పందించి బ్రిడ్జిపై వీధి దీపాలు వెలిగించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

ఎర్రసామంతవలసలో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని ఎర్ర సామంత వలస క్రీస్తురాజు పుణ్యక్షేత్రంలో శంకర్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. 350 మందికి ఉచిత నేత్ర పరీక్షలు జరిపారు. ఇందులో 150 మందికి కాట్రాక్ట్ ఆపరేషన్ నిమిత్తం శంకర్ ఫౌండేషన్ వారి హాస్పిటల్‌కు వైజాగ్ తీసుకెళ్లారు. వందమందికి పైగా ఉచిత కంటి చూపు పరీక్షలను చేసి కళ్లద్దాలను ఇచ్చారు. మిగిలిన వారికి పరీక్షలు చేసి కంటికి సంబంధించిన మందులను అందజేశారు. శిబిరానికి వచ్చిన రోగులకు పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ పువ్వల జీవన్ బాబు, పాస్టర్ డి.పాల్ ఉచిత భోజన సదుపాయం కల్పించారు.

నేత్రపరీక్షలు చేస్తున్న వైద్యులు

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ప్రస్తుతం రోడ్లపై అత్యధిక ప్రమాదాలు ద్విచక్ర వాహనదారుల నుంచి నమోదవుతున్నాయని, దీనికి ప్రధాన కారణం హెల్మెట్ ధరించకపోవడమేనని సాలూరు పట్టణం సిఐ అప్పలనాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రోడ్డు ప్రమాదాల నివారణలో హెల్మెట్ దారణపై అవగాహన సదస్సును నీడ్ స్వచ్ఛంద సంస్థ, సెట్విజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భరంగా ఆయన మాట్లాడుతూ నేడు యువత ద్విచక్ర వాహనాలను రహదారులపై ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా నడపడంతో చాలామంది ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జెవివిఎస్ ప్రసాద్ మాట్లాడుతూ వాహనం కలిగిన ప్రతి యాజమాని తప్పకుండా లైసెన్స్, ఇన్సూరెన్స్, టాక్స్ చెల్లించి మైనరైన యువకులకు వాహనాలను ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు

హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న సిఐ అప్పలనాయుడు

మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడం వల్ల ఎక్కువగా తలకు గాయాలై చనిపోవడం, వికలాంగులు కావడం జరుగుతుందన్నారు. వాహనం నడిపేటప్పుడు మొబైల్ వాడడం వల్ల ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. వీటన్నింటి నివారణకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధన ప్రకారం నడుచుకోవాలని, అప్పుడే ప్రమాదాల నుండి బయటపడగలమని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు నీడ్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరిస్తే ప్రమాదాలు జరిగే సమయంలో ప్రాణాపాయం నుండి రక్షణ పొందవచ్చని ఎస్ఐ ఎం.రాజేష్ అన్నారు. స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీలు చేసి అనంతరం హెల్మెట్ వాడకంపై ద్విచక్ర వాహన చోదకు లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ లంక శ్రీను, లక్ష్మణరావుతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెన్సీలో జోరుగా వరి కోతలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో వరి కోతలు, నూర్పులు పనుల్లో గిరిజన రైతులు బిజీగా ఉన్నారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవడంతో సెప్టెంబర్ నాటికి వరినాట్లు పూర్తయ్యాయి. దీంతో నవంబర్ నాటికి వరి పంట పండడంతో రైతులు వరి కోతలు, నూర్పులు ప్రారంభించారు. మండలంలోని లక్కగూడ, కేదారి పురం, గుమ్మలక్ష్మీపురం, గొరడ తదితర ప్రాంతాల్లో రైతులు వరికోత పనుల్లో బిజీగా ఉన్నారు.

విద్యార్థుల మరణాల నివారణకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాల నివారణకు శాశ్వత చర్యలు చేపట్టడంలో ఐటిడిఎ అధికారులు శ్రద్ధ వహించడంలేదని దీంతోనే తరచూ మరణాలు జరుగుతున్నాయని కురుపాం కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు అన్నారు. విద్యార్థి మరణించిన ప్రతిసారి వారి తల్లిదండ్రులకు చేతిలో కొంత డబ్బు ముట్టజెప్పి చేతులు దులుపుకుంటూ బాధ్యతారహిత్యానికి ఒడిగడుతున్నారని విమర్శించారు. జియమ్మ వలస మండలం రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థి నిమ్మక జీవన్ కుమార్ ఆకస్మిక మరణం అత్యంత బాధాకరం అన్నారు. ఇటువంటి మరణాలు జరగకుండా ప్రభుత్వం, ఐటిడిఎ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి చర్యలు తీసుకోవాలని కోరారు.

జోగింపేటలో పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి - సీతానగరం

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో భాగంగా వరి పంటలో 32 ఇన్సూరెన్స్ యూనిట్లలో మొత్తం 128 పంట కొత ప్రయోగాలను వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు మండలంలోని జోగింపేటలో పంటకోత ప్రయోగం చేపట్టారు. ఈ మేరకు మండల గణాంక అధికారి సతీష్ మాట్లాడుతూ జోగింపేటకు చెందిన గొర్జి సీతంనాయుడు పొలంలో పంటకోతప్రయోగం నిర్వహించగా 5.5 ప్లాట్ దిగుబడి 16.090 కేజీలు, క్షేత్రస్థాయిలో ఖాసాపేటకు చెందిన రైతు వెన్నెల గౌరమ్మ పొలంలో పంటకోత ప్రయోగాలు నిర్వహించగా 5.5 సెంటీమీటర్ల ప్లాట్‌లో 16.050 గ్రాములు దిగుబడి వచ్చిందన్నారు. ఈ పంట కోత ప్రయోగల ద్వారా వచ్చిన దిగుబడి రాష్ట్ర జిఎస్‌డిపి లెక్కింపులో ముఖ్య కీలకమన్నారు. దీని ఆధారంగా మండలంలో వరి పంట దిగుబడి సుమారు ఎకరాకు సరాసరి 28 బస్తాలుపైగా దిగుబడి వస్తుందని తెలిపారు. కార్యక్రంలో మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్, విఎఎలు జగదీష్, రాకేష్, ఇన్సూరెన్స్ బ్యాంక్ ఏజెంట్, రైతులు పాల్గొన్నారు.

పాడేరు ఏకలవ్య ఫౌండేషన్ పంటల పరిశీలన

ప్రజాశక్తి - పాచిపెంట

ఏకలవ్య ఫౌండేషన్ పాడేరు వాటర్ షెడ్ మేనేజర్ ఎం.ఉమా వెంకటేష్ ఆధ్వర్యంలో 20 మంది రైతులు మండలంలో పాదు కూరగాయల సాగును పరిశీలించారు. పి.కోనవలస, తెట్టెడువలస, మాతుమూరు, పాచిపెంటలో సాగులో ఉన్న వివిధ కూరగాయల నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో గల ప్రకృతి సేద్య వనరుల కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం ఎఒ కె.తిరుపతిరావు మాట్లాడుతూ రైతులను వేరే జిల్లాలో క్షేత్ర సుదర్శనకు తీసుకొచ్చినందుకు ఏకలవ్య ఫౌండేషన్‌ను అభినందించారు. అనంతరం రైతులకు పాచిపెంట మండలంలో సాగవుతున్న పంటల స్థితిగతులు, ప్రకృతి సేద్యానికి అమలు చేస్తున్న ప్రణాళికలు వివరించారు. జీవామృతాలు కషాయాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ టెక్నికల్ కోఆర్డినేటర్ జి.చంటిబాబు, ప్రకృతి సేద్య సిఆర్పి సురేష్, విజయ్, రైతులు పాల్గొన్నారు.